వ్యాపారిని మోసం చేసిన తండ్రీకుమారులపై కేసు

బంజారాహిల్స్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): బంగారం వ్యాపారిని మోసం చేసిన తండ్రీకుమారులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మెహిదీపట్నం రిలయన్స్ కోహినూర్‌లో నివాసముండే సలీముద్దీన్ షేక్‌పేట ద్వారకానగర్‌లో టీయారా జువెలరీ షోరూం నిర్వహిస్తున్నాడు. 2022లో సికందర్ పేరిట ఓ వ్యక్తి వచ్చాడు. బంగారు గొలుసులు బేరం ఆడి వెళ్లిపోయాడు. తర్వాత గతేడాది ఫిబ్రవరిలో వచ్చి కొన్ని ఆభరణాలు కొనుగోలు చేసి బిల్లు కట్టాడు. అప్పటి నుంచి తరుచూ సలీముద్దీన్‌కు ఫోన్ చేస్తూ తాను అమెరికాలో కెమికల్ వ్యాపారం చేస్తున్నట్టు చెప్పాడు. ఇలా తరుచూ ఫోన్ చేసి పరిచయం పెంచుకున్నాడు. గతేడాది డిసెంబర్‌లో మరోసారి ఫోన్ చేసి తన కుటుంబం అనుకోకుండా హైదరాబాద్‌కు వచ్చామని, ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు అరువుగా నగలు కావాలని డబ్బులు తర్వాత చెల్లిస్తానని నమ్మబలికాడు. సలీముద్దీన్ ఒప్పుకోవడం సికందర్ తన కుమారుడు అర్జున్‌ను పంపించాడు. అర్జున్‌కు సుమారు రూ. 23 లక్షలు విలువ చేసే 360గ్రాముల బంగారు అభరణాలు ఇచ్చాడు. ఇందుకు గాను అడ్వాన్స్‌గా రూ. 4.50లక్షలు అర్జున్ చెల్లించాడు. రెండు రోజుల్లో డబ్బు ఇస్తానని చెప్పిన సికిందర్ తన బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ అయిపోయాయంటూ కాలం వెల్లదీస్తూ వచ్చాడు. కొద్ది రోజుల క్రితం అర్జున్ తన తండ్రి ఇక లేరని సలీముద్దీన్‌కు మేసెజ్ పెట్టి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. మోసపోయినట్టు గ్రహించిన సలీముద్దీన్ ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగిక దాడి.. యువకుడి అరెస్టు

బోరబండ, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన బాలికకు మాయ మాటలు చెప్పి ఆపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని బోరబండ పోలీస్‌లు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఫలక్‌నుమాకు చెందిన అష్రఫ్ అలీ(19)బాలికతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకొని మాయ మాటలు చెప్పి కలబురిగి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యులు భరోసా కేంద్రాన్ని ఆశ్రయించారు. కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అష్రఫ్ అలీని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

హైమాస్ట్ లైట్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు..

వెంగళరావునగర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మధురానగర్ కాలనీ వెల్లంకి ఫుడ్స్ చౌరస్తా వద్ద ఉన్న హైమాస్ట్ లైట్ స్తంభాన్ని కారు ఢీ కొట్టింది. శుక్రవారం ఓ కారు కాలనీలోని హైమాస్ట్ లైట్ స్తంభాన్ని ఢీకొట్టడంతో కింది భాగంలో రెండు బోల్టులు విరిగిపోయాయి. స్తంభం కొద్దిగా ఒరిగిపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. దెబ్బతిని ప్రమాదకరంగా మారిన హైమాస్ట్ లైట్ స్తంభాన్ని తొలగించి, నూతన స్తంభంతో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని మధురానగర్ కాలనీ సంక్షేమ సమితి అధ్యక్షుడు కోడె సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి కళ్యాణ్ చక్రవర్తి, కోశాధికారి ఉప్పలయ్య జీహెచ్‌ఎంసీ వీధి దీపాల విభాగం ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. వీధి దీపాల విభాగం డీఈ మల్లికార్జున్, అధికారులు మధురానగర్ కాలనీకి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంగా ఉన్న స్తంభాన్ని వెంటనే భారీ క్రేన్ ద్వారా తొలగించారు. రెండు రోజుల్లో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేస్తామని డీఈ తెలిపారు.


దెబ్బతిన్న హైమాస్ట్ లైట్ స్తంభాన్ని పరిశీలిస్తున్న అధికారులు, సంక్షేమ సమితి ప్రతినిధులు

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

బంజారాహిల్స్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితులను కాంగ్రెస్‌నాయకులు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఫిలింనగర్ పద్మాలయ అంబేద్కర్‌నగర్‌లో నివాసముండే చిన్నారెడ్డి కుటుంబ సభ్యుల ఇల్లు నాలుగు రోజుల క్రితం అగ్నిప్రమాదంలో కాలిపోయింది. విషయం తెలుసుకున్న జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ నాయకుడు వంశీకృష్ణ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబ ఆర్థిక పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగిన సహాయం అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జె.అశోక్ కుమార్, మహిళా నాయకురాలు వరలక్ష్మి, ప్రభావతి, రాము, ఆనంద్, శివ పాల్గొన్నారు.


బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుడు వంశీకృష్ణ

రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతి

నార్సింగ్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి కోకాపేట గుట్టపై మూవీ టవర్స్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా గన్నేవరం గ్రామానికి చెందిన మునిగంటి కరుణాకర్ (45) డీసీఎం డ్రైవర్. పనిమీద నగరానికి వచ్చిన కరుణాకర్ కోకాపేట వద్ద రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు నార్సింగ్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఈ విషయాన్ని భార్య సుశీలకు సమాచారం అందించారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


కరుణాకర్ (ఫైల్)

కారులో తరలిస్తున్న124 కేజీల గంజాయి స్వాధీనం



రాజేంద్రనగర్, మార్చి1(ఆంధ్రజ్యోతి): అక్రమంగా కారులో తరలిస్తున్న 124.120 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లందు నుంచి రోడ్డు మార్గాన కారులో జహీరాబాద్‌కు తరలిస్తుండగా శుక్రవారం రాజేంద్రనగర్ పోలీసులు, ఎస్వోటీ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వారు హిమాయత్‌సాగర్ వద్ద నిఘా పెట్టారు. వివరాల్లోకి వెళితే... ఒడిస్సాకు చెందిన సోమేశ్ జహీరాబాద్‌లో నివాముంటున్న శివాజీకి గంజాయి సరఫరా చేసేవాడు. ఇందుకోసం భద్రాది కొత్తగూడెంకు చెందిన కారు డ్రైవర్ సపావత్ వెంకన్న(26)కు కిరాయి రూ. 10 వేలు ఇస్తామని మాట్లాడుకున్నారు. వెంకన్న గురువారం ఇల్లందు నుంచి (ఏపీ31బీఎఫ్ 8521 నెంబర్ కారులో 124.120 కిలోల బరువు ఉన్న 61 ప్యాకెట్ల గంజాయిని తీసుకుని బయలు దేరాడు. అడ్వాన్స్‌గా అతనికి రూ. 1500లు ఇచ్చి పంపించారు. గంజాయితో వస్తున్న కారు హిమాయత్‌సాగర్ వద్దకు రాగానే రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ బి. నాగేంద్రబాబు, ఎస్ఐ రమేశ్‌లతో పాటు ఎస్‌ఓటీ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. సరఫదారుడు సోమేశ్, సరుకు తీసుకుంటున్న శివాజీ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. కారు, గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ వెంకన్నను విచారిస్తున్నారు. గంజాయిని పట్టుకున్న పోలీసులను రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ విజయ్‌కుమార్, ఏసీపీ లక్ష్మీనారాయణ అభినందించారు.

దుర్గంచెరువులో అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ?

- నిపుణుల కమిటీ సిఫార్సులు అమలు చేయాల్సిందే
- హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరానికి తలమాణికంగా ఉన్న దుర్గంచెరువు పునరుద్ధరణకు నిపుణుల కమిటీ చేసిన దీర్ఘకాలిక, స్వల్పకాలిక సిఫార్సులపై ఏం చర్యలు తీసుకున్నారని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దుర్గంచెరువులో చేపలు చనిపోయి పైకితేలిన పరిస్థితిపై పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా ఈ అంశాన్ని హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. చెరువు పునరుద్ధరణకు హైకోర్టు నియమించిన నిపుణుల కమిటీ పరిశీలన జరిపి జలకాలుష్యం నివారణ సహా పలు సిఫార్సులు చేసింది. ఈ పిటిషన్‌పై తాజాగా శుక్రవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఎఫ్‌టీఎల్‌లో 78, బఫర్‌జోన్‌లో 146అక్రమ నిర్మాణాల తొలగింపునకు ఏయే చర్యలు తీసుకున్నారని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డిని ప్రశ్నించింది. 160 ఎకరాల్లో ఎఫ్‌టీఎల్ హద్దులు గుర్తిస్తూ ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చారని, ఫైనల్ నోటిఫికేషన్ ఎందుకివ్వలేదని అడిగింది. శుద్ధిచేయని మురుగునీరు చెరువులో చేరుతోందని వ్యాఖ్యానించింది. ప్రభుత్వం సమర్పించిన స్టేటస్ రిపోర్ట్‌లో నిపుణుల కమిటీ సిఫార్సులు అమలు చేస్తామని పేర్కొన్నారే తప్ప.. దానికి కాలపరిమితిని పేర్కొనలేదని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను మార్చి 11కు వాయిదా వేసింది.

కళాత్మకం..

- అద్భుత కట్టడంగా టీటీడీ ఆలయం • రాతితో నిర్మాణం
- 50 అడుగుల రాజగోపురం
- మార్చి 8 నుంచి బ్రహ్మోత్సవాలు


ఆలయ ప్రాంగణం

ఏడు కొండల వాడా వెంకటరమణ... ఆపద మొక్కుల వాడా అనాథ రక్షకా అని ఒక్కసారి తలుచుకుంటే చాలు కొలిచిన వారికి కొంగు బంగారమై సిరులిచ్చే స్వామి వెంకటేశ్వరుడు. అందుకే దివ్య మంగళ స్వరూపుడైన ఆయన ఆలయం ఎక్కడ ఉన్నా నిత్య కల్యాణం, పచ్చ తోరణంగా విరాజిల్లుతున్నది. తిరుమల గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆయన దర్శనం కోసం లక్షల మంది నిత్యం పడిగాపులు కాస్తూనే ఉంటారు. తిరుమలలో ఉన్న కాంతిని అన్ని ప్రాంతాలకు ప్రసరించేలా టీటీడీ ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ శ్రీవారి ఆలయం నిర్మాణం చేపట్టింది.

బంజారాహిల్స్ మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవాస్థానం సంప్రదాయానికి తీసిపోకుండా జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 98లో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం చేపట్టింది. అక్కడి ఆలయ నమూనాలో శ్రీవారి దేవాలయం నిర్మించింది. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 98లో సుమారు నాలుగు ఎకరాల స్థలంలో ఓ భక్తుడు విరాళంగా ఇచ్చాడు. ఆ స్థలం ఎక్కడ ఉందో కూడా అధికారులు ఎప్పుడు చూసుకోలేదు. ఈలోగా జూబ్లీహిల్స్‌లో వేగంగా నిర్మాణాలు పెరగడంతో కొంత మంది ఆక్రమించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ విషయాన్ని కాలనీ వాసులు టీటీడీ దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి స్థలాన్ని రక్షించారు. చుట్టూ ఫెన్సింగ్ వేసి కాపాడారు. 2015 ఆగస్టు 10న టీటీడీ ఛైర్మన్ చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది.

రాతితో నిర్మాణం

సుమారు 3.6 ఎకరాల స్థలంలో మహా గణపతి, అళ్వారు, పద్మావతి అమ్మవార్ల సమేత వెంకటేశ్వర స్వామి ఆలయం నిర్మించాలని నిర్ణయించారు. అనేక ఆలయాలు నిర్మించిన అనుభవం ఉన్న స్థపతి నటరాజన్ ఈ ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. తమిళనాడు నామకల్ నుంచి రాయిని తెప్పించి దానిపై నిర్మాణం చేపడుతున్నారు. ఆలయ ప్రహరీ, అంతరాలం, తదితర నిర్మాణాలన్నీ రాతితో చేసి 50 అడుగుల గోపురం మాత్రం కాంక్రీట్‌తో ఏర్పాటు చేశారు.

అన్నీ ప్రత్యేకతలే..

ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయం ఎదుట యాభై అడుగుల రాజగోపురం ఏర్పాటు చేశారు. రాజగోపురం, ఆలయ గోపురం, అంతర్భాగంలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా... శిల్పాలను అమర్చారు. మరో వైపు భక్తులు పుణ్యస్నాం ఆచరించేందుకు పుష్కరిణి, ఆహ్లాద కరమైన వాతావరణం అందించేందుకు మొక్కలను నాటారు.

బ్రహ్మోత్సవాలు

జూబ్లీహిల్స్ లోని వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఈనెల 8 నుంచి 16వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈనెల 7న సాయంత్రం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 17న పుష్పయాగం నిర్వహించనున్నారు.

బ్రహ్మోత్సవాల్లో వాహనసేవల వివరాలు

తేదీ	ఉదయం	సాయంత్రం
08-03-2024	ధ్వజారోహణం	పెద్దశేష వాహనం
09-03-2024	చిన్నశేష వాహనం	హంస వాహనం
10-03-2024	సింహ వాహనం	ముత్యపుపందిరి వాహనం
11-03-2024	కల్పవృక్ష వాహనం	సర్వభూపాల వాహనం
12-03-2024	పల్లకీ ఉత్సవం	గరుడ వాహనం
13-03-2024	హనుమంత వాహనం	గజ వాహనం
14-03-2024	సూర్యప్రభ వాహనం	చంద్రప్రభ వాహనం
15-03-2024	రథోత్సవం	అశ్వవాహనం
16-03-2024	చక్రస్నానం	ధ్వజావరోహణం

తిరుమల తరహాలోనే..

అత్యంత ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పంచుతున్న జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయంలో తిరుమల తరహాలోనే తిరుమల నుంచి వచ్చిన పూజారుల బృందం నిత్య పూజలు చేస్తున్నారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవతో మొదలు కల్యాణం, శుక్రవారం అర్చన వంటి సేవలు కూడా జరుగుతున్నాయి. తిరుమల నుంచి లడ్డూ ప్రసాదం కూడా అమ్మకాలు చేస్తున్నారు.

పేదలకు చేయూతనందించాలి : మేయర్

బంజారాహిల్స్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): బస్తీల్లో నివసించే పేద, మధ్య తరగతి మహిళలు, విద్యార్థినులకు చేయూత నందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్ రోడ్ నం. 12లోని ఎన్‌బీటీనగర్ బస్తీలో ప్యూర్(పీపుల్ ఫర్ అర్బన్ అండ్ రూరల్ ఎడ్యూకేషన్) అనే స్వచ్ఛంద సంస్థ మహిళలు, విద్యార్థినుల స్కిల్ డెవలప్‌మెంట్ కోసం ఏర్పాటు చేసిన కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని సంస్థ ఫౌండర్ శైలా తల్లూరితో కలిసి మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇలాంటి స్వచ్ఛంద సంస్థలు అందించే ఉచిత శిక్షణలను పొంది మహిళలకు స్వయం ఉపాధి వైపు ప్రయత్నాలు చేయాలని సూచించారు. సంస్థ డైరెక్టర్ అరుణ మాట్లాడుతూ మహిళలకు, విద్యార్థినులకు ఉచిత కంప్యూటర్ శిక్షణతో పాటు ఫుడ్ ప్రాసెసింగ్, శానిటరీ న్యాప్కిన్స్ తయారీ, చేతి వృత్తుల్లోని పలు విభాగాల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్టు తెలిపారు.


కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మేయర్ విజయలక్ష్మి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బంజారాహిల్స్ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శుక్రవారం మేయర్ విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. రోడ్డు నెంబరు 12 ఎన్‌బీటీ నగర్‌లో రూ. 30 లక్షలతో మంచినీటి పైపులైన్ పనులకు, ప్రేంనగర్‌లో రూ.1.10 కోట్లతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం బస్తీల్లో పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి : రోనాల్డ్ రోస్

బంజారాహిల్స్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట శ్మశాన వాటికలో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని కమిషనర్ రోనాల్డ్ రోస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కార్పొరేటర్ మన్నె కవితారెడ్డితో కలిసి శ్మశాన వాటికలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను కార్పొరేటర్, కమిషనర్ దృష్టికి తెచ్చారు. నూతన అభివృద్ధి పనులతో పాటు అసంపూర్తిగా ఉన్న వాటిని వెంటనే ప్రారంభించాలని అధికారులను అదేశించారు. ఆఫీస్ గది మిగిలిన పనులకు కూడా కమిషనర్ నిధులు మంజూరు చేస్తూ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. సింగాడి కుంట నాలా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని, నాలా బాక్స్‌డ్రైన్ పునర్నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. క్యాచ్ పిట్స్, రోడ్డు మరమ్మతుల కోసం టెండర్ పూర్తి చేసి వర్షకాలం నాటికి పూర్తి చేయాలన్నారు.


పంజాగుట్ట శ్మశానవాటికలో సమస్యలను పరిశీలిస్తున్న కమిషనర్ రోనాల్డ్ రోస్

- బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని ఖాళీ స్థలంలో మల్టీ లెవెల్ పార్కింగ్, తట్టిఖాన రిజర్వాయర్ సైట్ వద్ద కూడా మల్టీ లెవెల్ పార్కింగ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ రోనాల్డ్ రోస్ టౌన్ ప్లానింగ్ అధికారులను అదేశించారు. అనంతరం జలగం వెంగళరావు పార్కులో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. టాయిలెట్ మరమ్మతులు, పచ్చదనం అభివృద్ధి ఎలక్ట్రికల్ ఇంప్రూవ్ మెంట్, ఎస్‌టీపీ సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పరిశీలించి కెపాసిటీ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌కు సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే, ఎస్ఈ రత్నాకర్, యూబీడీ అదనపు కమిషనర్ డాక్టర్ సునంద తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్

ఉప్పల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హబ్సిగూడలోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. జూనియర్ అకౌంట్స్ అధికారి తోటి ఉద్యోగి నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నాచారం ఏడీఏ కార్యాలయంలో ఆర్టిజెన్‌గా పనిచేస్తున్న భరత్ తనకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో హబ్సిగూడ విద్యుత్ కార్యాలయంలో(టీఎస్ఎస్‌పీడీఎస్ఎల్) జూనియర్ అకౌంట్స్ అధికారి విజయసింహారెడ్డిని సంప్రదించాడు. 14నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. రూ.35 వేలు లంచం ఇస్తే కానీ తనకు రావాల్సిన బకాయిలు విడుదల చేయడం కుదరదని విజయసింహారెడ్డి చెప్పాడు. దీంతో హైదరాబాద్-2 యూనిట్ ఏసీబీ అధికారులను భరత్ ఆశ్రయించాడు. భరత్ నుంచి రూ.35వేలు లంచాన్ని విజయసింహారెడ్డి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి సాంకేతిక ఆధారాలతో నాంపల్లి ఏసీబీ కోర్టుకు తరలించారు.


ఏసీబీ అధికారులకు పట్టుబడిన విద్యుత్ ఉద్యోగి

అవినీతి అధికారులను పట్టిస్తే నజరానా

మహేశ్వరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అవినీతి అధికారులను ఏసీబీకి పట్టించిన వారికి కేఎల్లార్ ట్రస్టు ద్వారా రూ.లక్ష నజరానా అందజేస్తామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధి తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి అధికారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించదని తెలిపారు.

రేపు మల్లన్నస్వామి కల్యాణం

బోరబండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): బోరబండ సైట్-2 లోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి 16వ కల్యాణోత్సవానికి పచ్చని పందిరీలతో ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. మల్లన్న స్వామి కల్యాణం సందర్భంగా 2, 3, 4 తేదీల్లో పూజా కార్యక్రమాలు ఉంటాయని చైర్మన్ మహేష్ యాదవ్, అధ్యక్షులు అంజనేయుల యాదవ్, ప్రధాన కార్యదర్శి వీరేష్ యాదవ్ తెలిపారు. శనివారం సాయంత్రం గంగా తెప్పోత్సవంతో పూజలు ప్రారంభించి ఆదివారం ఉదయం 11:5 నిమిషాలకు మల్లన్నస్వామి కల్యాణం, అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుంది. మధ్యాహ్నం పెద్ద పట్నం, అగ్ని గుండాలు, గోలుసు తెంపుట వంటి పూజలు నిర్వహించి సాయంత్రం మల్లన్నస్వామి, ఎల్లమ్మ తల్లి బోనాల ఊరేగింపు ఉంటుంది. సోమవారం ఉదయం 8 గంటలకు నాగావళితో కార్యక్రమం ముగిస్తుంది.


ముస్తాబవుతున్న మల్లన్నస్వామి ఆలయం

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన

ఖైరతాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అగస్త్య ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్, సినోప్సిస్ వారి సౌజన్యంతో గురు, శుక్రవారం విశ్వేశ్వరయ్య భవన్‌లో అన్వేషణ పేరిట వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో కలిసి నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన ఆవిష్కరణలతో రెండు రోజుల పాటు జరిగిన ప్రదర్శనలను నగరంలోని పాఠశాలలు, కళాశాలలకు చెందిన రెండు వేల మంది విద్యార్థులు తిలకించారు. ఇందులో అంధ విద్యార్థుల కోసం స్పర్శ.. ధ్వని పేరిట తయారైన నమూనా, ఎంతటి సమూహంలో ఉన్నా ఆయుధాలను ఇట్టే పసిగట్టే డ్రోన్ మెటల్ డిటెక్టర్ నమూనా, రైతులు ఇంటివద్దే ఉంటూ తమ పంటలను రక్షించుకునేందుకు సరికొత్తగా చేసిన మల్టీ టాస్క్ రోబోట్ నమూనాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ లోగనాథన్ విజేతలకు నగదు బహుమతులతో పాటు ప్రోత్సాహకాలు అందజేశారు. ఇందులో ప్లానెట్ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ రఘునందన్ కుమార్, అగస్త్య ఫౌండేషన్ సీనియర్ ప్రతినిధులు శ్రీశైలం, బలరాం, అలోక్ ద్వివేది పాల్గొన్నారు.


ఉత్తమ నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు


అభివాదం చేస్తున్న దాసు సురేష్, వివిధ సంఘాల నాయకులు

నేడు సబ్బండ వర్గాల ఆత్మగౌరవ సమావేశం

పంజాగుట్ట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలని బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సబ్బండ వర్గాల ఆత్మగౌరవ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్టు సమితి అధ్యక్షుడు దాసు సురేష్ తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయం అంటూ జాతీయస్థాయిలో ప్రచారం చేసుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయాన్ని పక్కన బెట్టి కీలక పదవులను ఒకే సామాజిక వర్గానికి కట్టబెట్టడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాపాలనలో కొన్ని వర్గాలకే న్యాయం... మిగిలిన వర్గాలకు అన్యాయంపై ప్రజల్లో చైతన్యం కల్పిస్తామన్నారు. ఈ సమావేశానికి బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, జస్టిస్ చంద్రకుమార్, రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు, అజీజ్ పాషా, మాజీ ఎమ్మెల్యేలను ఆహ్వానించినట్టు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు గోపీ బోయ, సీహెచ్. భద్ర, పరమేశ్వరి, సినీ దర్శకుడు ఎం.సేనాపతి, రాజేష్, శరత్, సురేందర్, సాగర్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి

పంజాగుట్ట, మార్చి1 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలను ప్రజాస్వామ్య బద్ధంగా నిర్వహించాలని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్ వాచ్ కమిటీ చైర్మన్ డాక్టర్ బి.కేశవులు అన్నారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమాచార హక్కు చట్టం, ఓటర్లకు అవగాహన కల్పించే పాటల సీడీని ఆయన సంస్థ ప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో సమితి తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ కె.ఉషారాణి, నాయకులు హరిప్రసాద్, ప్రదీప్, శంకర్, శ్రీదుర్గ, రాంబాబు, రేణుక, ధనలక్ష్మి, నాగరాజు, శ్రీహరి, వాసు, తదితరులు పాల్గొన్నారు.


పాటల సీడీని అవిష్కరిస్తున్న సమాచార హక్కు పరిరక్షణ సమితి జాతీయ చైర్మన్ డాక్టర్ కేశవులు

'మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి'

బంజారాహిల్స్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ నాయకుడు వేణుగోపాల్ స్వామి అన్నారు. వెంకటేశ్వర కాలనీ డివిజన్ రాయల్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఆయన పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అన్ని చోట్ల విజయం సాధించి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. ఇక్కడి ప్రజలకు సేవ చేసేందుకు తనకు అవకాశం లభిస్తే రాబోయే ఎన్నికల్లో పోటీ చేయనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

3న జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

హైదరాబాద్ సిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు డి.మల్లేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పి.గోపాలకృష్ణగౌడ్ తెలిపారు.

ఫతేనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో ఈ పోటీలు ఉంటాయని, ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒకటి గంట వరకు ఉంటాయని, సాయంత్రం 4నుంచి విజేతలకు హూమతులు అందజేస్తారని తెలిపారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హులుగా ఎంపిక చేసుకునేందుకు దోహద పడుతాయన్నారు.

గేమ్ పాయింట్ బంజారా క్రీడా కేంద్రం ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): నగరంలోని యువ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ అందించాలనే లక్ష్యంతో బంజారా హిల్స్ లోని మెరిడియన్ పాఠశాలలో గేమ్ పాయింట్ బంజారా పేరిట క్రీడా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ మేరకు మెరిడియన్ విద్యాసంస్థలతో గేమ్ పాయింట్ ఒప్పందం చేసుకుంది. హైదరాబాద్‌లో ఇది తమ తొమ్మిదో క్రీడా కేంద్రమని గేమ్ పాయింట్ తెలిపింది. వర్ధమాన క్రీడాకారులతో మొదలు అన్ని వయో వర్గాల వారికి అధునాతన శిక్షణ అందించేందుకు నిష్ణాతులైన కోచ్‌లు అందుబాటులో ఉన్నారని గేమ్ పాయింట్ సీఈఓ ఆదిత్య రెడ్డి చెప్పారు.

హైదరాబాద్‌లో కార్టింగ్ రేస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ వేదికగా నాన్ మోటర్ కార్టింగ్ రేసును నిర్వహించేందుకు రెడ్‌బుల్ ఏర్పాట్లు చేస్తోంది. ఫిల్మ్‌నగర్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ట్రాక్‌లో ఈ రేసును నిర్వహించనున్నారు. ఇంజిన్ లేకుండా కేవలం గురుత్వాకర్షణ శక్తితో ఈ కార్లు నడవనున్నాయి. ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఈ రేసు ప్రారంభమవనుంది. ఫైనల్ రేసులో 30 జట్లు తలపడనున్నాయి.



కంటోన్మెంట్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

అమరవీరులకు నివాళులు

బోయిన్‌పల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మాదిగ అమరవీరుల దినోత్సవ కార్యక్రమాలు శుక్రవారం బోయిన్‌పల్లి డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ కూరగాయల మార్కెట్ వద్ద కంటోన్మెంట్ ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌సీ వర్గీకరణ సాధనలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు నివాళులర్పించిన ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ కంటోన్మెంట్ ఇన్‌చార్జి ఇటుక కిషన్ మాదిగ ఎంఆర్‌పీఎస్ కంటోన్మెంట్ ఇన్‌చార్జి మంద మధుకర్ మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం మార్కెట్ యార్డు వద్ద ఉన్న డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా నాయకులు అజిత్ కల్యాణ్ వాల్మీకి, డివిజన్ అధ్యక్షుడు బ్యాగరి నరసింహ, విష్ణుమాదిగ, కూరగాయల మార్కెట్ ప్రెసిడెంట్ మక్కల అశోక్, మున్నూరుకాపు సంఘం ప్రతినిధి బండి రాజు, చందు, రమేష్‌లతో పాటు ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు పాల్గొన్నారు.



తార్నాకలో ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో బీఆర్‌ఎస్ మహిళా విభాగం నాయకురాలు శుక్రవారం స్మితగౌడ్‌ను మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు.
- చిలకలగూడ, ఆంధ్రజ్యోతి

ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణంకు నిధులు మంజూరు చేయండి

పద్మారావునగర్, మార్చ్1 (ఆంధ్రజ్యోతి): బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి భోలక్‌పూర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల నూతన భవన నిర్మాణం కోసం 65లక్షల రూపాయల అదనపు నిధులు మంజూరు చేయాలని కోరుతూ సెక్రటేరియట్‌లో శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలసి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇచ్చిన లేఖను ఉన్నత పాఠశాల సాధన కమిటీ సభ్యులు అందజేశారు. వీరిలో ఈ.చంద్రశేఖర్, వీ.జే.శేశగిరిరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరెడ్డి ఉన్నారు.

దుస్తులు ఆరేయటానికి వెళ్లిన యువతి అదృశ్యం

బోయిన్‌పల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి బయట దుస్తులు ఆరేయటానికి వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఓల్డ్ బోయిన్‌పల్లి మల్లికార్జున నగర్‌లో ఓ కుటుంబం కొంతకాలంగా నివసిస్తున్నది. దంపతుల్లో భార్య అన్న కుమార్తె(19) వారి వద్ద నివసిస్తోంది. రెండేళ్ల క్రితం మైనర్‌గా ఉన్నప్పుడు జీడిమెట్లకు చెందిన నరేష్ ఆమెపై అత్యాచారం చేయడంలో బిడ్డకు జన్మనిచ్చింది. అతడిపై పోక్సో కేసు నమోదు కావడంతో జైలుపాలయ్యాడు. బాధితురాలు అప్పటి నుంచి ఓల్డ్ బోయిన్‌పల్లిలోనే ఉంటోంది. గురువారం సాయంత్రం దుస్తులు ఆరేయటానికి బయటకు వెళ్లిన యువతి తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు బోయిన్‌పల్లి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. నరేష్‌పై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంపొందిస్తాయి

బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే శ్రీగణేష్

తిరుమలగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : క్రీడా పోటీలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని అందిస్తాయని బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. శుక్రవారం యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో తిరుమలగిరి విలేజ్‌లోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జరుగుతున్న రెండో కార్డినల్ ఫుట్‌బాల్ కప్‌ను శుక్రవారం క్రీడా మైదానంలో జరుగుతున్న టోర్నమెంట్‌లో యువ క్రీడాకారులను కలిసి విజయావకాశాలు గురించి మాట్లాడారు. క్రీడాకారులకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. నిర్వాహకులు రేమండ్, మైఖెల్, లూయిస్, నరేష్, కార్తిక్ పాల్గొన్నారు. క్రీడాకారులకు కంటెస్టెడ్ బీజేపీ ఎమ్మెల్యే శ్రీగణేష్ అభినందిస్తూ కరచాలనం చేశారు.



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శంకర్, చిత్రంలో నిందితుడు సుబ్రమణ్యం తిలక్

పెరోల్‌పై విడుదలయ్యి తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తి అరెస్ట్

బౌద్ధనగర్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): జీవితఖైదును అనుభవిస్తు పెరోల్‌పై విడుదలయ్యి తప్పించుకుని తిరుగుతున్న ఓ వ్యక్తిని శుక్రవారం వారాసిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. చిలకలగూడ డివిజన్ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం నేరేడ్‌మెట్ వినాయక్‌నగర్‌కు చెందిన సుబ్రమణ్యం తిలక్ అలియాస్ తిలక్‌రాజ్(40) 2003వ సంవత్సరంలో షామీర్‌పేట్ పరిధిలో జరిగిన హత్యకేసులో నిందితుడు. 2005 సంవత్సరంలో సుబ్రమణ్యం తిలక్‌కు జీవిత ఖైదు శిక్ష పడింది. తల్లితండ్రులు అనారోగ్యంగా ఉన్నారని ప్రతి సంవత్సరం పెరోల్‌పై విడుదల అయ్యి మరల జైలుకు వెళ్లేవాడు. 2020వ సంవత్సరంలో సుబ్రమణ్యం తిలక్ పెరోల్‌పై విడులయ్యి పార్శిగుట్ట సంజీవపురంలో వచ్చాడు. తర్వాత పోలీసులు కళ్లుగప్పి తప్పించుకుని తిరుగుతున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు వినాయకనగర్‌లో ఉన్న సుబ్రమణ్యం తిలక్‌ను వారాసిగూడ పోలీసులు అరెస్ట్ చేశారు.

38 ఏళ్లుగా గుడిసెలే ఆవాసం

- పక్కా ఇళ్ల కోసం విజ్ఞప్తి చేస్తున్న అంబేద్కర్‌నగర్ బస్తీవాసులు

మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా, తమ బతుకులు మారడంలేదని, పక్కా ఇళ్లకు నోచుకోవడంలేదని మారేడుపల్లిలోని అంబేడ్కర్‌నగర్ గుడిసెవాసుల సంఘం బస్తీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1979లో ఈ బస్తీ ఏర్పాటుకాగా, 38ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం వీరికి పట్టాలిచ్చింది. బస్తీవాసుల్లో 340 కుటుంబాల వారికి ప్రభుత్వం పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వగా, 50 కుటుంబాలను మాత్రం విస్మరించింది. అప్పటి నుంచి 50 కుటుంబాలు పక్కా ఇళ్లకు నోచుకోలేదు. జీ ప్లస్ టు లేదా జీ ప్లస్ త్రీ పద్ధతిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వడానికి రెండు బ్లాకులకు గాను 800గజాల స్థలం ఉందని, అందులో నిర్మాణం చేపట్టాలని బస్తీవాసులు కోరుతున్నారు.



అంబేద్కర్‌నగర్ బస్తీలోని గుడిసెలు

ఏ ప్రభుత్వం వచ్చినా మమ్మల్ని పట్టించుకోలేదు

38 ఏళ్ల నుంచి ప్రభుత్వాలు మారుతున్నాయే కానీ మమ్మల్ని ఎవరూ పట్టించుకోలేదు. 1986లో పట్టాలిచ్చిన సర్కారు.. అప్పుడు పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చింది. కొందరికి పక్కాఇళ్లను కట్టించి, మమ్మల్ని మాత్రం వదిలేసింది. నాలాగే 50 మంది ఉన్నారు. మా అందరికీ ఈ ప్రభుత్వమైనా డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు కట్టిస్తుందనే ఆశతో ఉన్నాం.



- ఎ.సాయిలు
అంబేడ్కర్‌నగర్ బస్తీ

గాయాలతోనే పరీక్షా కేంద్రానికి విద్యార్థిని

- చికిత్స చేయించి తిరిగి తీసుకొచ్చి ఉదారత చాటిన ఇన్‌స్పెక్టర్

రాంగోపాల్‌పేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పరీక్షా సమయం మించిపోతుందని ఆతృతగా పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థిని ప్రమాదానికి గురై అలాగే గాయాలతో పరీక్షా కేంద్రానికి రాగా కేంద్రం వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆ విద్యార్థినిని తన వాహనంలో ఆస్పత్రికి పంపి తన ఉదారతను చాటుకున్నాడు. కంటోన్మెంట్ అన్నానగర్‌కు చెందిన భవాని(16) ఇంటర్‌మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్నది. ఇంటర్ వార్షిక పరీక్షల నేపథ్యంలో శుక్రవారం ఉదయం తన పరీక్ష కేంద్రమైన ఎంజీ రోడ్డులోని తపస్య కాలేజీకు తన తండ్రితో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తుండగా అన్నానగర్ చౌరస్తాలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద వేరే వాహనం తగిలి కిందపడి గాయాలపాలయ్యింది. పరీక్ష సమయం మించిపోతుందనే ఆతృతతో తనను పరీక్ష కేంద్రానికి త్వరగా తీసుకు వెళ్లాలని తండ్రిని కోరగా, అలాగే ఆమె తండ్రి భవానిని గాయాలతో అలాగే పరీక్షా కేంద్రానికి తీసుకువచ్చాడు. పరీక్ష కేంద్రానికైతే వచ్చింది కానీ కూర్చునే స్థితిలో కూడా లేకపోవడాన్ని గమనించిన, అక్కడే విధులు నిర్వహిస్తున్న మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.ఉపశంకర్ వెంటనే స్పందించి కళాశాల ప్రిన్సిపల్ వద్ద అనుమతి తీసుకొని విద్యార్థినిని తన వాహనంలో సికింద్రాబాద్‌లోని విజయ హెల్త్‌కేర్ ఆస్పత్రికి ప్రథమ చికిత్స నిమిత్తం పంపగా, ఆస్పత్రి వైద్యులు తలకు గాయమైనచోట 7కుట్లు వేసి, ఇంజక్షన్‌లు ఇచ్చి, ప్రథమ చికిత్స చేశారు. సకాలంలో విద్యార్థినిని పరీక్ష కేంద్రం వద్దకు తీసుకురావడం జరిగింది. సమయానికి విద్యార్థినిని ప్రథమ చికిత్స నిమిత్తం తన వాహనంలో పంపిన మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.ఉపశంకర్‌ను, అలాగే గాయాలతో వచ్చిన విద్యార్థినికి కుట్లు వేసి ప్రథమ చికిత్స చేసినప్పటికీ ఒక్క రూపాయి కూడా తీసుకోని విజయ హెల్త్‌కేర్ ఆస్పత్రి వర్గాలను ట్రాఫిక్ డీసీపీ రంగారావుతో పాటు పలువురు అభినందిచారు. ఒక్క నిమిషం నిబంధన వల్లనే విద్యార్థులు ఇలా ఒత్తిడికి గురవుతున్నారని ఈ సందర్భంగా పరీక్ష కేంద్రం వద్ద తల్లిదండ్రులు అభిప్రాయపడ్డారు.



విద్యార్థినితో మాట్లాడుతున్న మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

మారేడ్‌పల్లిలో వ్యక్తి దారుణహత్య

- పోలీసుల అదుపులో నిందితుడు

మారేడ్‌పల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : వెస్ట్ మారేడ్‌పల్లి ప్రధాన రహదారిలోని ఓ బేకరీ ముందు గురువారం అర్ధరాత్రి పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్కాజిగిరి దయానంద్ నగర్‌కు చెందిన మొహమ్మద్ ఇమ్రాన్ (25) రెండు సంవత్సరాల క్రితం భార్గవి(సానా)ని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఏసీ టెక్నీషియన్‌గా పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. వీరికి ఐదు నెలల బాబు ఉన్నాడు. కాగా నేపాల్‌కు చెందిన సందీప్ బహదూర్ (25) కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చాడు. పూల డెకరేషన్, ఇతర పనులు చేసుకునేవాడు. మహమ్మద్ ఇమ్రాన్, సందీప్ బహదూర్‌లకు కొన్ని సంవత్సరాల క్రితం స్నేహం ఏర్పడింది. ఈ క్రమంలోనే సందీప్ బహదూర్, ఇమ్రాన్‌కు డబ్బుల విషయంలో మనస్పర్ధలు ఏర్పడ్డాయి. డబ్బు ఇవ్వాలంటూ సందీప్ ఫోన్‌లో గత రెండు రోజులుగా ఇమ్రాన్‌ను బెదిరిస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలోనే మొహమ్మద్ ఇమ్రాన్ మారేడ్‌పల్లిలో నివాసం ఉంటున్న బంధువుల ఇంటికి వారం రోజుల క్రితం వచ్చాడు. గురువారం అర్ధరాత్రి 11.30 సమయంలో వెస్ట్ మారేడ్‌పల్లి ప్రధాన మార్గంలో మొహమ్మద్ ఇమ్రాన్, సందీప్ బహదూర్ మధ్య మాట మాట పెరిగి డబ్బుల విషయంలో మద్యం సేవించిన మత్తులో ఘర్షణ పడ్డారు. సందీప్ బహదూర్ మొహమ్మద్ ఇమ్రాన్ మెడ గొంతుపై ఉన్న పెద్ద నరంపై పదునైన కత్తితో దాడి చేసి పొడిచాడు. తీవ్రమైన రక్తస్రావం అవుతుండడంతో మారేడ్‌పల్లి పోలీస్ స్టేషన్ వైపు పరిగెత్తసాగాడు. అప్పటికే స్పృహ కోల్పోయి రోడ్డుపై కిందపడిపోయాడు. పోలీసులకు అప్పటికే సమాచారం అందడంతో తీవ్ర గాయాలపాలైన మొహమ్మద్ ఇమ్రాన్ వద్దకు వచ్చి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. గాంధీ ఆసుపత్రికి చేర్పించేలోపే ఇమ్రాన్ మృతి చెందాడు. తన భర్త ఇమ్రాన్‌ను సందీప్ బహదూర్ చంపాడని పేర్కొంటూ మారేడ్‌పల్లి పోలీసులకు మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ కేసు మారేడ్‌పల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు సందీప్ బహదూర్ పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం.



దారుణహత్యకు గురైన మహమ్మద్ ఇమ్రాన్



నిందితుడు
సదీప్ బహదూర్



నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

'కాళేశ్వరం'లో రూ.లక్షల కోట్ల కుంభకోణం

- బీఆర్‌ఎస్ బృందం మేడిగడ్డ సందర్శనపై కాంగ్రెస్ నేతల నిరసన

అడ్డగుట్ట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో లక్షల కోట్ల రూపాయల కుంభకోణం జరిగిందని, న్యాయవిచారణ చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.యాదగిరి డిమాండ్ చేశారు. మేడిగడ్డకు కేటీఆర్ బృందం వెళ్లడంపై శుక్రవారం అడ్డగుట్టలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. ఇటీవల నల్లగొండ సభలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడుతూ.. మేడిగడ్డలో ఏముందని, కాంగ్రెస్ నాయకులు ఎందుకు వెళ్తున్నారని విమర్శలు చేశారన్నారు. శుక్రవారం కేటీఆర్‌తోపాటు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు మేడిగడ్డ సందర్శనకు ఎందుకు వెళ్లారో ఆయన సమాధానం చెప్పాలన్నారు. మేడిగడ్డకు వారు వెళ్లడం సిగ్గుచేటన్నారు. కేసీఆర్ అబద్ధాలు చెబుతూ తెలంగాణ ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. మేడిగడ్డ వెళ్లిన బీఆర్‌ఎస్ నాయకులు రాష్ట్ర ప్రజలకు ఏం న్యాయం చేశారో గుర్తుచేసుకుంటే బాగుంటుందన్నారు. కల్వకుంట్ల కుటుంబం అవినీతి చేసి కాంగ్రెస్‌పై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. నిరసన కార్యక్రమంలో గౌతమ్, చిలుకమ్మ, లలిత, సునీత, వెంకటలక్ష్మి, సాలమ్మ, ఉమ, అరుణ, నాగరాజు పాల్గొన్నారు.

దుర్గంచెరువులో అక్రమ నిర్మాణాలపై చర్యలేవీ?

- నిపుణుల కమిటీ సిఫార్సులు అమలు చేయాల్సిందే
- హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరానికి తలమానికంగా ఉన్న దుర్గంచెరువు పునరుద్ధరణకు నిపుణుల కమిటీ చేసిన దీర్ఘకాలిక, స్వల్పకాలిక సిఫార్సులపై ఏం చర్యలు తీసుకున్నారని హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. దుర్గంచెరువులో చేపలు చనిపోయి పైకితేలిన పరిస్థితిపై పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా ఈ అంశాన్ని హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. చెరువు పునరుద్ధరణకు హైకోర్టు నియమించిన నిపుణుల కమిటీ పరిశీలన జరిపి జలకాలుష్యం నివారణ సహా పలు సిఫార్సులు చేసింది. ఈ పిటిషన్‌పై తాజాగా శుక్రవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఎఫ్‌టీఎల్‌లో 78, బఫర్‌జోన్‌లో 146 అక్రమ నిర్మాణాల తొలగింపునకు ఏయే చర్యలు తీసుకున్నారని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డిని ప్రశ్నించింది. 160 ఎకరాల్లో ఎఫ్‌టీఎల్ హద్దులు గుర్తిస్తూ ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చారని, ఫైనల్ నోటిఫికేషన్ ఎందుకివ్వలేదని అడిగింది. శుద్ధిచేయని మురుగునీరు చెరువులో చేరుతోందని వ్యాఖ్యానించింది. ప్రభుత్వం సమర్పించిన స్టేటస్ రిపోర్ట్‌లో నిపుణుల కమిటీ సిఫార్సులు అమలు చేస్తామని పేర్కొన్నారే తప్ప.. దానికి కాలపరిమితిని పేర్కొనలేదని వ్యాఖ్యానించింది. తదుపరి విచారణను మార్చి 11కు వాయిదా వేసింది.

లయన్స్‌క్లబ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వీల్‌చైర్ అందజేత

ఏ.ఎస్.రావు నగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడు రాజు(10)ను ఆదుకునేందుకు కుషాయిగూడ లయన్స్ క్లబ్ ట్రస్ట్, లయన్స్ హాస్పిటల్ ప్రతినిధులు ముందుకు వచ్చి శుక్రవారం అతడికి రవాణా సౌకర్యం కోసం వీల్‌చైర్‌ను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన లయన్ హాస్పిటల్ చైర్మన్ కొత్త రామారావు మాట్లాడుతూ నిరుపేదలు, విద్యార్థులకు లయన్స్ సేవలను మరింత విస్తరిస్తామని అన్నారు. లయన్స్ వి.నర్సింగ్ గౌడ్, హేమంత్ రాజు, గోపాలరావు, చంద్రశేఖర్ రావు, రవిశంకర్, వెంకట్ రెడ్డి, బెనర్జీ, రాంచందర్, పురుషోత్తం రావు, రాజు తల్లిదండ్రులు నాగరాజు, కల్యాణి, సోదరి కల్యాణి తరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుంది

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మారేడ్‌పల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లోని మహీంద్రా హిల్స్ డీపీఎస్ స్కూల్ వద్దకు చేరుకున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి శుక్రవారం విజయసంకల్ప్ యాత్రలో భాగంగా మహిళలు మంగళవారం హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉందని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని రీతిలో దివ్యాంగుల సంక్షేమానికి మోదీ అనేక చర్యలు తీసుకున్నారని కిషన్‌రెడ్డి తెలిపారు. దివ్యాంగులతో ముఖాముఖి సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాల కోసం పనిచేసిన ప్రభుత్వం మోదీ ప్రభుత్వం అని తెలిపారు. అంగ వైకల్యంతో ఉన్న వారిని దివ్యాంగులని సంబోధించాలని చెప్పడమేకాకుండా అలానే పిలవాలని ప్రధాని మోదీ జీఓ తీసుకువచ్చారని చెప్పారు. దివ్యాంగులకు 3 శాతం ఉన్న రిజర్వేషన్‌ను 4శాతానికి పెంచిన ఘనత కూడా నరేంద్రమోదీకే దక్కుతుందని అన్నారు. గతంలో తాము చేసిన పోరాట ఫలితమే దివ్యాంగుల పెన్షన్ అని అన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు.



దివ్యాంగులతో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి

అడ్డగుట్టలో...

అడ్డగుట్ట బీజేవైఎం డివిజన్ అధ్యక్షుడు గెల్లు ఉదయ్ యాదవ్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విజయసంకల్ప యాత్రను శుక్రవారం ప్రారంభించారు. అడ్డగుట్ట తుకారాంగేట్ సాయినగర్ మీదుగా వారాసిగూడకు యాత్ర బయల్దేరి వెళ్లింది. అడ్డగుట్ట బీజేవైఎం కార్యకర్తలు కిషన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. బీజేవైఎం జిల్లా కార్యదర్శి శివాజీ, ప్రధాన కార్యదర్శులు రాజేష్, చింటూ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్

ఉప్పల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): హబ్సిగూడలోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. జూనియర్ అకౌంట్స్ అధికారి తోటి ఉద్యోగి నుంచి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నాచారం ఏడీఏ కార్యాలయంలో ఆర్టిజన్‌గా పనిచేస్తున్న భరత్ తనకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉండడంతో హబ్సిగూడ విద్యుత్ కార్యాలయంలో (టీఎస్ఎస్‌పీడీఎస్ఎల్) జూనియర్ అకౌంట్స్ అధికారి విజయసింహారెడ్డిని సంప్రదించాడు. 14 నెలల వేతనాలు విడుదల చేయాలని కోరారు. రూ.35వేలు లంచం ఇస్తే కానీ తనకు రావాల్సిన బకాయిలు విడుదల చేయడం కుదరదని విజయసింహారెడ్డి చెప్పాడు. దీంతో హైదరాబాద్-2 యూనిట్ ఏసీబీ అధికారులను భరత్ ఆశ్రయించాడు. భరత్ నుంచి రూ.35వేలు లంచాన్ని విజయసింహారెడ్డి తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. కేసు నమోదు చేసి సాంకేతిక ఆధారాలతో నాంపల్లి ఏసీబీ కోర్టుకు తరలించారు.



ఏసీబీ అధికారులకు పట్టుబడిన విద్యుత్ ఉద్యోగి

అవినీతి అధికారులను పట్టిస్తే నజరానా

మహేశ్వరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అవినీతి అధికారులను ఏసీబీకి పట్టించిన వారికి కేఎల్లార్ ట్రస్టు ద్వారా రూ.లక్ష నజరానా అందజేస్తామని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి (కేఎల్లార్) అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల పరిధి తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి అధికారులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లో ప్రోత్సహించదని తెలిపారు.

నేటి నుంచి (ఎన్ఐఈపీఐడి) పేరెంట్స్ జాతీయ సమావేశం

బోయిన్‌పల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మేధో, అభివృద్ధి వైకల్యాలు ఆటిజం, సెరిబ్రల్ పాల్సీ, మేధో వైకల్యం, బహుళ వైకల్యాలు ఉన్న పిల్లల తల్లితండ్రుల సంఘంకు సంబంధించిన పరివార్ నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ పేరెంట్స్ జాతీయ సమావేశం శనివారం, ఆదివారం రెండు రోజులపాటు సికింద్రాబాద్ బోయిన్‌పల్లిలో గల మనోవికాస్ నగర్‌లోని ఎన్ఐఎంహెచ్ (ఎన్ఐఈపీఐడి) నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెక్చువల్ డిజెబిలిటీస్ సంస్థలో నిర్వహిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ బి.వి.రాంకుమార్ వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఎన్ఐఎంహెచ్ (ఎన్ఐఈపిఐడి) సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పరివార్ అంటే ఒక కుటుంబమని అన్నారు. పరివార్ ప్రధానంగా ఒక న్యాయవాద సంస్థ. మేధో మరియు అభివృద్ధి వైకల్యాలు (పిడబ్ల్యుఐడిడి)లు ఉన్న వ్యక్తుల హక్కులను సాధికారతను భద్రపరచడానికి పనిచేస్తుందని, మేధో వైకల్యం, బహుళ వైకల్యాలు ఉన్న పిల్లల తల్లితండ్రులకు ఈ సంస్థలలో అవగాహన కల్పించడానికి పరివార్ వివిధ కార్యక్రమాలలో నిమగ్నమై ఉందన్నారు. పీడబ్ల్యుఐడీడీల హక్కులు మరియు నిబంధనల కోసం ప్రభుత్వంతో అనుభవాన్ని పంచుకోవడానికి మరియు వాదించడానికి నోడల్ నెట్‌వర్కింగ్ సంస్థగా కూడా పరివార్ వ్యవహరిస్తుందని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న తల్లితండ్రులు పాల్గొంటారన్నారు. సమావేశం సాధికారతపై దృష్టిపెడుతుంది. మరియు మేధో వికలాంగులకు పునరావాస సమస్యలు లాంటి విషయాలపై నిపుణులు మార్గనిర్దేశం చేస్తారని, స్వతంత్ర జీవనోపాధి నమూనాలు, మద్దతు వ్యవస్థల అభివృద్ధి వంటి వివిధ అంశాలపైన ఈ సమావేశంలో చేర్చించనున్నట్లు తెలిపారు. పరివార్ అనేది దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల్లోని అనుబంధ సంస్థలను కలిగి ఉన్న రాష్ట్ర సమాఖ్య జాతీయ సంస్థ పరివార్ అని అన్నారు. ఈ కార్యక్రమానికి పరివార్ నేషనల్ కాన్ఫెడరేషన్ ఆఫ్ పేరెంట్స్ జాతీయ అధ్యక్షుడు శ్రీ పంకజ్ మారు హాజరుకానున్నట్లు వెల్లడించారు.

3న విశ్వశాంతి యువజన సంఘం ఎన్నికలు

బౌద్ధనగర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లోని బీదల బస్తీ, విశ్వశాంతి యువజన సంఘం ఎన్నికలు ఈనెల 3వ తేదీన జరగనున్నాయి. బీదలబస్తీ, విశ్వశాంతి యువజన సంఘం అధ్యక్షుడి పోటీకి ముగ్గురు ఎన్నికల్లో నిలబడ్డారు. స్థానిక బస్తీవాసులైన విద్యాసాగర్, నందారం సీతారాంమాదిగ, గడ్డం ప్రసాద్ (వేముల ప్రసాద్)లు తమదైన రీతిలో ఎన్నికల ప్రచారాన్ని చేస్తున్నారు. సుమారు వెయ్యి ఓట్లు వరకు ఈ బస్తీలో ఉన్నాయి. తాము ఎన్నికల్లో గెలిస్తే బీదలబస్తీని అన్నివిధాల అభివృద్ధి చేస్తామని స్థానికులకు హామీలు ఇస్తున్నారు. అధ్యక్షుడిగా గెలిచిన తర్వాత పూరిస్థాయిలో కమిటీని ఏర్పాటు చేయనున్నారు.



చర్లపల్లి పాఠశాలకు వాటర్ ఫిల్టర్లు, ల్యాబ్ టేబుల్స్‌ను అందజేసిన 'ఫిన్' ప్రతినిధులను సన్మానిస్తున్న స్కూల్ యాజమాన్యం

ప్రభుత్వ పాఠశాలకు 'ఫిన్' వితరణ

కుషాయిగూడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట్‌కు చెందిన పీపుల్ విత్ హియరింగ్ ఇంపేర్డ్ నెట్‌వర్క్ (ఫిన్) స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు శుక్రవారం చర్లపల్లిలోని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలకు చేయూతనిస్తూ చేపట్టిన ప్రాజెక్టులో భాగంగా ఈ పాఠశాల విద్యార్థుల సౌకర్యం కోసం మూడు సైన్స్ ల్యాబ్ టేబుల్స్, వేయిమంది విద్యార్థినులకు న్యాప్కిన్‌లు, ప్రాథమిక పాఠశాల విద్యార్థుల తాగునీటి కోసం నాలుగు వాటర్ ప్యూరిఫయర్‌లను అందజేశారు. వి-గార్డ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ సామాజిక బాధ్యతగా అందజేసిన ఆర్థిక సాయంతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు సంస్థ ప్రతినిధులు బాలకృష్ణా రెడ్డి, మాధవి తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభ, వి-గార్డ్ ఎలక్ట్రానిక్స్ కంపెనీ ఉద్యోగులు వి.సందీప్, రాజు గోవింద్ గిరి, విశాల్, ఉపాధ్యాయులు వేణు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఈటల' వ్యక్తి కాదు.. ఓ శక్తి

- ఈటల రాజేందర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీకే మహేష్

మల్కాజిగిరి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు ఈటల రాజేందర్‌పై పార్టీకి చెందిన వారే అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సీనియర్ నాయకులు వీకే మహేష్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఈటలకు టికెట్ ఇస్తే తాము సహకరించబోమంటూ కొందరు నేతలు పత్రికలకెక్కడం పార్టీ పరువు తీయడమే అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేగా, రెండు పర్యాయాలు మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న గొప్ప నాయకుడు ఈటల అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆయన ఓ కీలక వ్యక్తి అని అలాంటి ప్రజా మద్దతు ఉన్న నాయకుడిని విమర్శించడం మంచి పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. ఈటల అప్పుడు నియోజకవర్గంలోని అల్వాల్‌లోనే ఉన్నాడని, ఇప్పుడు మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోనే ఉంటున్నాడని అలాంటప్పుడు స్థానికేతరుడు అని ఏవిధంగా అంటారని ఆయన ప్రశ్నించారు. ఏదిఏమైనా కేంద్రం దృష్టిలో సత్తాగల నాయకుడనే ఆయనకు మల్కాజిగిరి నుంచి అవకాశం ఉంటుందని భావిస్తున్నారని, అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించుకుని ప్రధాని మోదీకి బహుమతి ఇస్తామని ఆయన అన్నారు. ఈటలకు టికెట్ ఇచ్చినట్లయితే నియోజకవర్గంలో భారీ మెజార్టీ తీసుకువస్తారని అందుకు కార్యకర్తలు నాయకులు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.